స్కెచ్

# అంతులేని ఆశాపాశం

ఎమ్. విశ్వనాథశాస్త్రి

వెంకట్రావు నాకు చాలా ముఖ్యుడవడంవల్ల, వాడు చెడిపోతూంటే నేను బాధపడడం సహజమైన విషయమే. వాడికి నా మీద ఉన్న గౌరవభావాన్నిబట్టి, వాడిని సన్మార్గంలో పెట్టడం నా విధి అని తోచింది నాకు. కాని చిత్రమేమిటంటే, నా శక్తి అంతా ఉపయోగించి కూడా, వాడు చేస్తూన్న పని చెడ్డపనీ అని వాణ్ణి ఒప్పించడం నా తరం కాలేదు. ఇంతకీ వాడు చేస్తున్నదల్లా, నెలా అయేటప్పటికి క్రాస్‌వర్డ్ పజిల్స్‌కి ఇరవయ్యో, పాతికో తగలయ్యడమే! అన్నిరకాల పజిల్స్‌కీ అయిదో ఆరో చొప్పున కడుతూ ఉంటే, నెలా అయేటప్పటికి ఓపాతిక ఖర్చవడంలో ఆశ్చర్యం లేదుగదా! పోనీ వాడికి వెనకాల కాస్త స్తోమత ఏమన్నా ఉందా అంటే, చేసే గుమాస్తా పనిపోతే తల దాచుకోవడానికి గూడు కూడా లేదు ఆఖరికి. వాడికి డబ్బంటే లెక్కలేక పోవడానికి నాకు కనుపించిన కారణమల్లా ఒక్కటీ—వాడికింకా పెళ్ళికాలేదు. అవునుమరి, నాబోటి పిల్లలతండ్రికి తెలుస్తుంది కాని డబ్బు విలువ, కుర్రనాగమ్మ వాడికేం తెలుస్తుంది?

ఓరోజున మట్టుకు కొంచెం గట్టిగానే చెప్పాను. "నాయనా, వెంకట్రావూ! నువ్వు చేస్తున్నదేమంత మంచిపని? బాదరబందీ, పితలాటం ఇంకా ఏమీ లేదు కాబట్టి, ఇప్పుడే ఏమన్నా కాస్త వెనక వేసుకొంటే, రేప్పొద్దున భార్యామణిగారి సొమ్ములకీ, ఆపైన పిల్లడి పాలడబ్బాలకీ జేబులు తడుముకోవలసిన అవసరం ఉండదుకద! ఇప్పుడు ఇలా పజిల్స్‌కి తగలేస్తే ఏమన్నా అర్థం ఉందా? ఇప్పటికప్పుడే ఓ రెండు వందలో మూడువందలో తగలేశావు. మహావస్తే ఓపాతికో పరకో కన్న ఎక్కువ వచ్చింది కనకనా ఇప్పటికి? అందుకని కాస్త అనుభవం ఉన్నవాడిమాట తీసెయ్యక, ఇలాగ డబ్బు తగలేయకు" అంటూ ఓచిన్న లెక్చరు కొట్టాను.

"నిజమే అనుకోండి మీరు చెప్పింది అంతాను. కాని మొన్నటికి మొన్న చూడండి! ఒకతనికి లక్షరూపాయలు నికరంగా చేతికందాయట! ఇల్లాంటివి చూసే, ఏదో కొంచం ఆశపడి, నాల్గు రకాల పజిల్స్‌కీ కడుతున్నాను నాల్గింటిలోనూ నాలుగు వేలేనా రాకపోతాయూ అని!" అన్నాడు వెంకట్రావు కొంచం సిగ్గుబడుతూ.

"నిన్నుచూస్తుంటే నవ్వువస్తోంది వెంకట్రావూ! ఆ లక్షరూపాయలు వచ్చినవాడు నీలాగే నాల్గు రకాల పజిల్స్‌కీ కట్టాడనా నీ అభిప్రాయం? ఒక పజిల్‌కే చాలా సొల్యూషన్సుపంపి ఉంటాడు. ఏమైనా, ఎవడికో వచ్చిందనీ, వెనక ఏమీలేని నీబోటిగాళ్ళు నాబోటిగాళ్ళు పులిని చూసి నక్క వాతపెట్టుకున్నట్లుచెయ్యడంమంచిదికాదు. అవతల ఏదో వస్తుందోరాదో తెలియదుకాని, ముందు చేతిలో డబ్బుఖర్చుపెట్టుకోవడం తెలివైనపని అంటావా?" అన్నాను.

ఒక్కక్షణం ఆలోచించి "మీరుచెప్పింది అన్ని విధాలా సబబుగానే ఉండనుకోండి! నాకుమట్టుకు వృథాగా ఖర్చుచేయడం ఇష్టమా? మీరుచెప్పినట్లే చేస్తాను. అయితే ఈ ఒక్కసారి మట్టుకి ఒక్క పజిలులోనే కొంచెం ఎక్కువడబ్బు పెడతాను. వస్తేసరి లేకపోతే పజిల్స్‌కి గుడ్‌బై" అన్నాడు వెంకట్రావు.

"ఏమిటో నీ పిచ్చిగాని, మనబోటిగాళ్ళకి రావయ్యా వీటిల్లో. సరే, ఈ పట్టుకి ఏదో కానీ వాళ్ళకి యింకా ఋణమున్నట్టుంది నువ్వు. ఇంక మట్టుకి మళ్ళీ పజిల్స్‌కి కట్టనని ఒట్టువేయి" అని వెంకట్రావుచేత ఒట్టు వేయించుకుని యింటికి బయలుదేరాను.

ఒక మానవుని మంచిమార్గంలో పెట్టాననే ఆనందంతో చరచరా అడుగులువేసి ఇంటికి చేరుకున్నాను. ఏమిటో, వెంకట్రావు పిచ్చిగాని, ఈ మాత్రం దానికి అతనికి గెలుపు వచ్చి ఏడుస్తుందా?

ఏమో? ఎవరు చెప్పగలరు? ప్రతీమాటూ రకరకాల పజిల్స్‌కి కట్టినవాడు, ఇప్పుడు నా సలహావిని ఒక్క పజిల్‌కే కట్టానన్నాడు కూడాను! ఒకవేళ అతనికి లక్షరూపాయలువస్తే!...

ఈ ఆలోచన వచ్చేటప్పటికి గుండె ఒక్కమాటు ఝల్లుమంది. వెంకట్రావు లక్షాధికారా?— అమ్మయ్యో, ఇంక వాడికి పట్టపగ్గాలుంటాయా? ఒక్కపజిల్లోనే డబ్బుఅంతా పెడితే ప్రైజు రావచ్చని నే చెప్పబట్టికదా వెంకట్రావు అలా చేస్తూ వుంటే! నేను నోరు మూసుకుని ఊరుకొన్నా వదలి పొయ్యేదే...

కాని ఎంత ప్రయత్నించినా, వెంకట్రావుకి లక్షరూపాయలు వస్తాయేమో అన్న ఆలోచన భరించలేకపోయాను. ఇదివరకటి సదుద్దేశ్యాలన్నీ నాకు తెలియకుండానే నాలోంచి పోయాయి. ఇప్పుడు నా కోరికల్లా ఒక్కటే, ఎలాగైనా వాడికి ఈమాటు ప్రైజు రాకూడదు. చేసిన వాగ్దానం ప్రకారం మళ్ళీ ఇంక ఎలాగా పజిలుకి కట్టడుకదా వాడు?

మర్నాడు బజారులో కనుపించి యాభై రూపాయిలు ఖర్చుచేసి పజిల్స్ పంపానని చెప్పాడు. లేనినవ్వుని తెచ్చుకుని, "విష్‌యు గుడ్‌లక్" అని ఎలాగో ఇంటికి చేరుకున్నాను.

"వీడికి ఎల్లాగా వచ్చేస్తుంది లక్షరూపాయిలూ" అంటోంది నామనస్సు. ఇప్పుడు నాకు వెంకట్రావుమీద ఉన్న శ్రేయోభిలాషా అవీ పూర్తిగా పోయాయి. నేను కోరుకొన్నదల్లా, "శంకర పరమాత్మా, ఈప్రైజు వాడికి రాకుండా చూడు" అని.


కాని ఇంతల్లోనే ఇంకో ఆలోచనవచ్చింది. వాడికి వస్తుందో అని ఏడవకపోతే, నేనుకూడా పజిల్‌కి కడితే? పజిల్‌ద్వారా ఒహలక్ష రూపాయిలు జేబులో వేసుకోవాలనే కోరిక కొన్ని సంవత్సరాలనుంచీ నాగుండెలో ఓమూల ఉన్నమాట నిజం. చాలామందికి ఇల్లాంటి కోరికే ఉంటుందనే నా నమ్మకం. కాని పజిల్‌కి డబ్బుకట్టకపోవడానికి నాకు, నాలాంటివాళ్ళకీ కారణం అల్లా, పోస్టు ఆఫీసులోని గుమాస్తా, తదితరులు మనవైపుచూసే చూపులను భరించేశక్తి లేకపోవడమే. పజిలుకి డబ్బుకట్టిన వాణ్ణి 'ఓరిఅప్రాచ్యుడా!' అన్నట్లు చూశేవాడేకద, ప్రతివాడూనూ! పజిల్స్ కట్టేటప్పుడు ఎవళ్ళకంటా పడకుండా ఉండడానికి వీలుంటే చాలామంది, నాతోసహా, ప్రయత్నిస్తారని నా నమ్మకం.

ఓహారం రోజుల తరువాత, వెంకట్రావు కనబడి, "రేపటి పేపర్లో వస్తాయండీ మా రిజల్ట్సు" అన్నాడు. అతనికి తప్పకుండా ప్రైజు వస్తుందనీ, మర్నాడు పొద్దున్న మా ఇంటికి కాఫీకి రమ్మనీ చెప్పి కొంపకి చేరుకున్నాను.

మర్నాడు పొద్దున కుర్చీలో కూర్చుని వెంకట్రావు కోసం ఎదురుచూడ సాగాను. ఏడున్నర అయింది. ఇంకో అరగంటలో వస్తాడు వెంకట్రావు. ఆ అరగంటలోనూ నేనుపడ్డ బాధ తలుచుకుంటే ఇప్పుడు నామీద నాకే అసహ్యం వేస్తోంది. కొంప మునిచి వెంకట్రావుకి లక్షవస్తే! అమ్మయ్యో! "ఏమైనా రావడానికి వీలులేదు" అని పైకే అనేశాను.

ఇంతలో వెంకట్రావు వచ్చాడు. లేని ఉత్సాహాన్ని తెచ్చుకుంటూ, గబగబా ఎదురువెళ్ళి "కాయా, పండా?" అన్నాను. 'కాయ' అన్నాడు దిగులుపడుతూ "అరెరే, నీకు నిజంగా వస్తుందనుకున్నాను సుమా!" అన్నాను లేని బాధను చూపిస్తూ, మనస్సులో నాకు లక్ష రూపాయలు వచ్చినంత ఆనందం కల్గినా. "ఇక జన్మలో కట్టనండి...మన ఒట్టుప్రకారం చేస్తాను" అన్నాడు మరింత కుంగిపోతూ వెంకట్రావు. "అరే, అదేమిటి, అలా దిగాలుపడిపోతావు. నీకు ధనలాభం కలిగితే ఆనందించేవాళ్లల్లో ప్రప్రథముణ్ణి నేనని నీకు తెలుసుకదా? నాకు ఒట్టువేసినంతమాత్రాన మానమని నే నననుం. నీ అదృష్టానికి అడ్డురావాలని నాకుంటుందా!" అన్నాను. "నిజమే అనుకోండి. ఒక్క తప్పు వస్తే మీ ఒట్టుని గట్టునపెట్టేవాడినే! కాని ఇంత డబ్బు తగలేస్తే నాలుగు తప్పులు రావడం ఏమిటండీ మనకా అదృష్టం, యోగం లేకగానీ. జన్మలో మళ్ళీ కట్టను. వస్తాను, అన్నట్టు పనుంది" అంటూ వెళ్ళాడు వెంకట్రావు.

"అమ్మయ్య! నా కోరికలాగానే, వెంకట్రావుకి ప్రైజు రాలేదు, మళ్ళీ కట్టనని శపథం చేశాడు కదా" అని తృప్తిగా నిట్టూర్చాను. ★



# శకున ఫలితం

బి. పద్మావతి

కథానిక

ఆ రోజు నిద్రలేస్తూనే పిల్లిని చూశాడు రామం!

"లేస్తూనే పాడుపిల్లి దాపరించింది, యివాళ ఏం జరగనున్నదో" అని మళ్ళీ ముసుగుతన్ని యింకో పదినిముషాలు పడుకున్నాడు.

"లేచికూడా మళ్ళీ పడుకున్నావేంరా? ఎనిమిది గంటలైంది లే!" అంటూ లేపటానికి వచ్చింది దుర్గమ్మగారు.

గబగబాలేచాడు రామం, తల్లికేకలు విని.

"అంతగాభరా యెందుకురా? నిదానంగా లేవరాదూ?" అన్నది దుర్గమ్మగారు మంచంమీద పరుపు చుట్టూ.

"అదికాదమ్మా! ఆలస్యం చేస్తే నువ్వు వెళ్ళిపోతావేమోనని!" అన్నాడు రామం.

"నేనెక్కడికి పోతానురా, నాయనా!"

"అదికాదమ్మా! కాస్త ముందుగావచ్చి లేపకూడదూ? లేస్తూనే యివాళ పిల్లిమొహం చూశాను. అందుకనే మళ్ళీ పడుకున్నాను. ఈసారి మంచిశకునంచూసి మరీలేద్దాం అని ఆలోచిస్తూంటే నువ్వేవచ్చావ్...నువ్వువెళ్తే మళ్ళీ ఏపిల్లి వస్తుందోనని గబగబా లేస్తున్నా!" అన్నాడు రామం, 'పళ్ళపొడి' చేతిలో వేసుకుంటూ.

రామం యస్. యస్. యల్. సి. పరీక్షకు కూర్చున్నాడు. నిదానస్తుడు; బుద్ధిమంతుడు, మేధకుడు! కాని అతనికి వారఫలాలన్నా, శకునాలన్నా తగనినమ్మకం.

కాలకృత్యాలు తీర్చుకుని, కాఫీ త్రాగి, అలా యెక్కడికైనా వెళ్దామని బయలుదేరాడు. ఈలోగా చిట్టితమ్ముడు ఎక్కడ పసికట్టాడో! వచ్చి! "ఎక్కడికన్నయ్యా నేనూ వత్తా!" అని మారాంసాగించాడు.

"హరి భగవంతుడా! యివ్వాళ లేచినప్పట్నించీ అన్నీ అపశకునాలే!" అని నిట్టూరుస్తూ, "ఎక్కడికీ వెళ్ళటంలేదు. ఎక్కడికైనా వెళ్తే నిన్ను తీసుకు వెళ్ళకుండా వెళ్తానా!" అంటూ తమ్ముడు ప్రసాదును మాటలతో తృప్తిపరుద్దామని వెనక్కు తిరిగి వచ్చాడు రామం.

వాడు అంతటితో తృప్తిపడ్డేగా? "మరే! అన్నయ్యా! ఎక్కడికీ వెళ్ళకపోతే, తెప్పాలెందుకు తొడుక్కున్నావు? తలదువ్వుకున్నావు? చొక్కా తొడుక్కున్నావు! నాకు తెలుసులే! నేనూ వత్తా!" అంటూ తన అఖండమైన తెలివితేటలను తెలియపరిచాడు వాడు.

పాంటు, షర్టు వేసుకుని, చెప్పులు తొడుక్కుంటే, యెక్కడికో వెళ్తున్నట్లే! అది వాడికో కొండగుర్తు. పట్టుకున్నాడంటే వదలడు.

"స్కూల్ కి వెళ్తున్నానోయ్! నువ్వు రాకూడదు. ఇంట్లోకివెళ్ళి నీళ్లుపోసుకో పో!" అన్నాడు రామం.

"అయితే పుత్తకాలేవీ? అన్నీ అబద్ధాలు! నేనూ వత్తా!" వాడు పట్టువదల్లేదు.

"హాయ్భగవాన్! శనినైనా వదల్చుకోవచ్చుగానీ వీడిని వదల్చుకోటం బ్రమ్మతరంకూడాకాదు!" అని నిట్టూర్చి, "పో చొక్కా తొడుక్కునిరా పోదాం." అన్నాడు.

వాడు కదలకుండా నిలబడి "నువ్వుకూడారా!" అన్నాడు.

"నేనుకూడా ఎందుకురా?...పో...అమ్మచేత తొడిగించుకురా! తొందరగా పోదాం" అన్నాడు రామం.

"నేను ఇంట్లోకి పోతే నువ్వు వెళ్ళి